
# హింసనాదం

ఏ.వి. శేషారత్నం



**బుచ్చిరాజు** జీవితంలో అది సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజు. ఆ ఉత్తరం చూసిన దగ్గర్నుంచీ కిందా మీదా అయిపోతున్నాడు.

"గౌరవనీయులు, సంగీత సామ్రాట్టులు అయిన బుచ్చిరాజుగారికి-

మీరు దయతో మా ఆహ్వానం అంగీకరించి మా ఊరిలో కచ్చేరి చేయగలరని ఆశిస్తున్నాం. కచ్చేరి అనంతరం సన్మానం కూడ ఏర్పాటు చేశాం.

మీకోసం, మీ గానామృతం గ్రోలడంకోసం మేము వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాం.

నమస్కారాలతో,

-బి. బి. ఎ "ఎ. అధ్యక్షుడు."

ఇన్నాళ్ళకి తన సంగీతానికి గుర్తింపు కలిగిందన్నమాట! మట్టిలో మాణిక్యంలా పడి ఉన్నాడు ఇన్నాళ్ళూ...

బుచ్చిరాజు కళ్ళవెంట అశ్రువులు రాలిపోతున్నాయి. సంగీతం నేర్చుకోడానికి ఎంత కష్టపడ్డాడు! ఎన్ని అవమానాలు భరించాడు? సంగీతమంటే విపరీతమైన పిచ్చి అభిమానం తనకి. కాని, అంతా తనని నిరుత్సాహపరచినవారే.

'వద్దురా, బుచ్చీ! పుట్టగానే నువ్వేడిస్తే బొడ్డుకోయబోయిన మంత్రసాని వేలు తెగ్గోసుకుందిరా. మనకి సంగీతం అచ్చిరాదు, బాబూ!'- అంది తల్లి.

కానీ, తన జీవిత లక్ష్యం సంగీతం. ఎల్లాగైనా సాధించాలని తపన పడ్డాడు.

తన గొంతు బాగుండదని అంతా ఒకటే హేళన. కానీ, అలా అన్నవాళ్ళచేత తను గొప్ప విద్వాంసుడుగా గుర్తించబడాలి.

చిన్నప్పుడు దేవుడిముందు నిలబడి ప్రార్థనా శ్లోకం పాడితే చిన్న చెల్లెలు జడుసుకుని జ్వరం తెచ్చుకుందని తండ్రి చావ గొట్టాడు.

తను పల్లెటూళ్ళో చదువుకుంటున్న రోజుల్లో ప్రెసిడెంటుగారు ఎమ్. ఎల్. ఎ. గారి సన్మాన సభకి తనని స్వాగత గీతం పాడమన్నారు. ఆ రోజు ఎంత గర్వపడ్డాడు.

తను గొంతెత్తి పాడుతుంటే అంతా నిశ్శబ్దం. ఆఖరికి ఒక కుక్కకూడ తోకాడిస్తూ స్టేజి మీదికి వచ్చేసింది. కాని ఆ రోజు అవమానం మరిచిపోలేదు. తను మరింత హుషారుగా కుక్కను చూస్తూ మరింత రాగం తీశాడు. అది చీదరింపుగా చూసి ఎమ్. ఎల్. ఎ. గారి కుర్చీ కోడుకి కాలు ఆనించి రెండో కాలెత్తి లఘు శంక తీర్చుకుని వెళ్ళిపోయింది. అంతా ఘొల్లుమన్నారు.

అప్పట్నుంచే తన సంగీతం అంటే అందరికీ వినోద మయిపోయింది.

"ఆకాశవాణిలో పాడేవంటే కుటుంబ నియంత్రణ అక్కర్లేదురా."

"ఒరేయ్ బుచ్చీ! సీతమ్మకి నొప్పులొస్తున్నాయ్. చాల బాధపడుతోందిట. నువ్వు కాస్త గొంతెత్తి పాడకూడదూ'-వంటి మాటలెన్నో విన్నాడు. చివరి కో రోజు తెగించి ఆచారిగారి దగ్గర కెళ్ళాడు.

ఆ రోజు ఆచారిగారిని మొహమాటపడుతూనే అడిగాడు-"నాకు గాత్రం నేర్పించండి' అని.

ఆయన చాలా దయగా చూశారు.

"సంగీతం నేర్చుకోవాలనే తృష్ణ కలగడం పూర్వజన్మ సుకృతం, నాయనా! నా శక్తివంచనలేకుండా నేర్పిస్తాను. ఏదీ నీకు బాగా వచ్చిన చిన్న పద్యం పాడి వినిపించు. నీది సుస్వరమో, కాదో వింటాను."

హరిశ్చంద్రలో పద్యం చదివాడు. కాటి సీనులో పద్యం తన కెంత ఇష్టమో!

కానీ తన దౌర్భాగ్యమేమోకాని, గురువుగారికి ఎడతెరిపిలేకుండా జాడించి విరేచనాలు మొదలయ్యాయి. వివరీతమైన నీరసంతో కూలబడుతూ-"నాయనా బుచ్చిరాజూ! కాస్త పద్యం ఆపు, బాబూ! తట్టుకోలేక పోతున్నాను. కడుపులో గాభరా తగ్గలేదు. నిన్ను నిరుత్సాహపరచకూడదు. నువ్వు గాత్రం బదులు ఏదైనా వాద్యం నేర్చుకో, నాయనా!"

"నాకు గాత్రం చాల ఇష్టం, గురువుగారూ!" ఆయన కాళ్ళు పట్టేసుకున్నాడు.

ఆయన భయంగా చూశారు. "నీ ఒక్క గొంతులో ఒక్కసారిగా నాలుగు స్వరాలు వినిపిస్తున్నాయి. నాకు ఈ సంగీతమే జీవనాధారం, బాబూ! నువ్వు పాడుతూ తన్మయత్వంలో మునిగిపోయావు గానీ, లోపల నా భార్యకు ఏడు వాంతులయ్యాయి. పిల్లలంతా బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. నీ గాత్రానికి ఎప్పటికైనా గుర్తింపు వస్తుంది. నీ కంతగా నేర్చుకోవాలంటే నాదమునికి లేఖ రాసిస్తాను తీసుకెళ్ళు." అన్నా డాయన నీరసంగా.

కళ్ళ నీళ్ళతో వెనుదిరిగాడు. స్వరం లేసంత మాత్రాన తను పనికిరాడా?

నాదమునిగారు తనని నిరాశపరచలేదు. కానీ, ఎక్కువ డబ్బడిగారు. తండ్రి చీరేస్తానన్నాడు సంగీతం పేరెత్తితే. కాని, వంశోద్ధారకుడిని నిరాశపరచటం ఇష్టంలేని తల్లిమాత్రం తనకి సాయపడింది తండ్రిని ఒప్పించడంలో.

"ఇంట్లో సాధన చెయ్యొద్దను. ఆ ఏడు పేదో అక్కడే ఏడవమను." అతను బాధగా ఒప్పుకున్నాడు.

తనకి చాలా కృతుల వరకూ నేర్పారు నాదమునిగారు. ఆయన దగ్గర తనొక్కడే శిష్యుడు. అసలు ఆయన దీ వృత్తి కాదు. ఆచారిగారి మాటకు విలువిచ్చి తనకు ఓపిగ్గా నేర్పించా డాయన.

కాని, ఆయన మోసం త్వరలోనే తెలిసినా ఏం చెయ్యలేకపోయాడు.

నాదమునిగారు పాఠం నేర్పాక మళ్ళీ సాధన చేయించేటప్పుడు లోపలి కెళ్ళి వచ్చేవారు. తన్మయత్వంలో పడి తను ఎప్పుడూ గమనించలేదు. కాని, చివరికి ఒక రోజు-

హంసనాదం తను తీవ్రంగా సాధన చేస్తున్నాడు.

కెవ్వుమన్న కేక అది గురువుగారిదే. 'ఆపు...ముందా గానం ఆపు. నా మిషన్ ఆఫ్ అయిపోవడం లేదు.'

వారి మాటలు అర్థంకాక పాట ఆపేశాడు.

తరవాత చెవిలో పెట్టుకునే మిషన్ చొక్కాలోంచి తీసి మీట నొక్కి చూసుకున్నారు. అంతే...తన గుండె బద్దలయింది. అంతవరకూ ఆ మిషన్ ఏమిటో, ఎందుకో గమనించనందుకు తనని తనే తిట్టుకున్నాడు.

నాదమునిగారికి పుట్టెడు చెవు డన్న మాట! తను సాధన చేసే సమయంలో మిషన్ తీసేయడానికే లోపలి కెళ్ళి వస్తున్నారు. అందుకే తను పాడుతున్నంత సేపు ఆయన ముఖం అంత ప్రశాంతంగా ఉంది అన్నమాట.

ఆయన స్వరం ప్రశాంతంగా పలికింది. 'నాయనా బుచ్చిరాజూ! నిన్ను మోసం చేశా ననుకోకు. సంగీత సరస్వతి నిన్ను కరుణించింది. నీకు తప్పకుండా ఖ్యాతి కలుగుతుంది. నీ కింక విద్య చాలు, నాయనా!' అంటూ దీవించడం మొదలెట్టా డాయన.

ఎలాగా దీవిస్తున్నాడు కదా అని ఇక తప్పక ఆయనకు సాష్టాంగపడ్డాడు తను.

ఆనాటి గురువుగారి వాక్కు ఫలిస్తోంది. బి.బి.యస్. అంటే గొప్ప సంస్థ అయి ఉంటుంది. మృదంగం వాయించే అప్పారావుకి తప్పక తెలిసుండాలి.

అప్పారావు తన మన సెరిగిన ప్రాణమిత్రుడు. చిన్నప్పుడు 'పాడకురా. అంత చలిలో గొంతు నీళ్ళలో మునిగి నువ్వు భక్తితో పాడుతున్నందుకు దేవుడు ప్రత్యక్షం కాడు కాని, చెరువులో చేపలన్నీ చచ్చిపోతాయిరా' అని ఏడిచేవాడు. కాని తరవాత మెత్తగా 'ఏదైనా వాద్యం నేర్చుకో కూడదట్రా!' అంటూ బతిమాలేవాడు.

అప్పారావుకి ఉత్తరం చూపించేసరికి ఓ క్షణం మూర్ఛపోయాడు. అక్షరాలా తప్పు కాదు కదా అని తిరగేసి మళ్ళీ చూశాడు.

బుచ్చిరాజుకి చిరు కోపం వచ్చింది. 'నన్ను నుమానిస్తున్నావా'

'ఛ కాదురా! మరి కచేరీ అంటే ప్రక్క వాద్యాలు...'

'ఎంత డబ్బయినా ఇస్తాను- వయొలిన్‌కి చూడు. మృదంగానికి నువ్వున్నావుగా.'

అప్పారావు మొహంలో నెత్తురు చుక్క లేదు. 'నేను...నేనా...నే...'

మరి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు బుచ్చిరాజు.

ఎంద్రకాయ మొహం ఆఫీసరును ఒప్పించి రెండ్రోజుల్లో ప్రావిడెంటు ఫండు లోన్ రెండు వేలు తీసుకున్నాడు. తనకి వచ్చిన ఆహ్వానానికి ఆఫీసులో అందరి మొహాలు చింత పిక్కల్లా తయారయాయి. ఒకరు బాగ పడుతున్నారంటే అదేమిటో అందరికీ ఏడుపే!

ఇంతకుముందు తను చాలా కచేరీలు చేసినట్టుంటే ఘనంగా ఉంటుందని పట్టు శాలువా ఒకటి కొందామనుకున్నాడు. ఇంటి కెళ్ళేసరికి ఇల్లంతా నేతి స్వీట్లతో గుమగుమ లాడుతూంది.

'ఓ సేప్ బుచ్చికి జీడిపప్పులు పట్రా. నాయనా బుచ్చీ! నా మతి మరుపుకూడా ఒక్కోసారి ఎంత ఉపయోగపడుతుందో చూశావా? రిటైరయిన డబ్బుల్లో రెండు వేలు పాత కోటులో మర్చిపోయాను. నిన్న-రాత్రి పెట్టెలో దొరికింది. దాంతో పాత అప్పులు తీర్చేసి పిల్ల వెధవలకి తిన్నంత తింటారని గంపెడు పళ్ళు, డబ్బాడు మిఠాయిల్ని కొన్నానురా. దా, నాన్నా తిందువుగాని' అన్నాడు గారంగా తండ్రి.

పాత కోటు అనగానే కెవ్వుమన్నాడు బుచ్చిరాజు. లోన్ తీసుకున్నట్టు తెలిస్తే అంతా అప్పుల గోలని నిన్న మధ్యాహ్నం భోజనాని కొచ్చినప్పుడు ఎవరూ చూడకుండా పెట్టెలో తండ్రి పాత కోటు జేబులో దాచాడు.


తండ్రి మొహం అమాయకంగా ఉంది. శేరు ముక్కు పొడుం కూడా కొనే ఉంటాడు. ఆ ముక్కు సామాన్యమైనది కాదు. బాత్‌రూమ్‌లో కెళ్ళి బావురుమని ఏడ్చుకున్నాడు బుచ్చిరాజు.

అయినా మొట్టమొదటి కచేరీ కెళ్ళేముందే తండ్రితో గొడవ దేనికని తనను తానే ఓదార్చుకున్నాడు.

తన సంగీతం పిచ్చితో తండ్రి నెంత విసిగించినా, ఆయన బాధ పడలేదు. ఆఖరికి బి.ఎ.లో గుండమ్మ కథ సినిమా పాటలు అన్ని పరీక్ష పేపరులో వ్రాసి వచ్చానని తెలిసిన రోజునా నోరెత్తలేదు. ఇప్పుడు ఏమన్నా, తండ్రి గురువులాంటివాడు. ఆయన మనసు నొప్పించడం శుభం కాదు.

** ** **

-బి.బి.యస్. ఆహ్వానం. హాలు ముఖద్వారం పై సువర్ణాక్షరాలతో జనసందోహంతో కిటకిట



లాడిపోతోంది. బుచ్చిరాజుకి మతిపోయింది. తన కింతమంది అభిమానులా! కనీసం ఈ ఊరిపేరు కూడా ఎప్పుడూ వినలేదు. అప్పారావే తీసుకొచ్చాడు. అప్పారావూ, వయొలిన్ రాఘవయ్యకూడా జనాన్ని చూసి నిర్ఘాంతపోయారు. ఆ రోజు బుచ్చిరాజులో సంగీత విద్వాంసుడు విజృంభించాడు. ఆ విజృంభణలో జనాల చెవుల్లోని దూది పింజలు ఎక్కడ గమనించగల డతను? అదొక రసప్రవాహం- అందులో తల మునకలుగా కొట్టుకుపోతూ ఉక్కిరి బిక్కిరయి పోతున్నట్టు తల లూగిస్తూన్న జనం. ఎత్తైన శిఖరం మీంచి పెద్ద అగాధంలోకి ఒక్కసారిగా పరవళ్ళు తొక్కుతూ దూకిన జలపాతంలా చప్పట్లు-సముద్రఘోష.

బుచ్చిరాజు ఆనందాని కవధుల్లేవు. ఇలాంటి విచిత్ర నగరాన్ని ఎప్పుడూ చూడలే దతడు. తను కోరుకున్న దిదే.

అన్ని గంటలపాటు స్తంభించిపోయిన ఆ ఊరి జనం సంగీత పిపాసకు. రసహృదయాలకు. కళారాధనకు కన్నీరు పెట్టుకున్నాడు బుచ్చిరాజు.

అతని కళ్ళలో గోదారి. గళంలో సావేరి కావేరిలా పరుగులు. సభికుల కళ్ళలో ఆనందభాష్పాలు.

కచేరీ మధ్యలోనే అధ్యక్షుడు బుచ్చిరాజుకి పట్టు శాలువా కప్పాడు. మరో రెండు గంటలపాటు కచేరీ కొనసాగాలని కోరుకున్న సభికుల విజ్ఞాపన అధ్యక్షుడి ముఖంగా అందుకున్న బుచ్చిరాజు అభ్యంతరం చెప్పలేదు.

రెట్టించిన ఉత్సాహంతో హంసనాదం అందుకున్నాడు.

'బంటురీతి...'

మరో గంట గడిచినా జనంలో కదలిక లేదు. గాయకుడికి అలసట లేదు. కాలం మరో గంటను మింగేసింది. జనం మొహాల్లో అదే తన్మయత్వం. వాళ్ళలో విసుగు కానీ, చికాకు గానీ మచ్చుకయినా కనిపించడం లేదు.

మరో 'షిఫ్టు' మీద అభ్యర్థన-

కళాకారుడిగుండె చెరువయింది. కానీ, బుచ్చిరాజా చీటీ విప్పలేదు. అందులో ఏముంటుందో అత నూహించ గలడు.

'అయ్యా! మీ సంగీతాభిమానాన్ని తట్టుకోలేకపోతున్నాను. నా కీ రోజుకి సెల విప్పిస్తే ధన్యుడిని.' రెండు చేతులూ జోడించి. ఆఖరి పాటగా.

భజన్ పాడుతుంటే భోరున విలపించా రంతా. బుచ్చిరాజుకూడా పట్టు శాలువాతో కళ్ళు తుడుచుకున్నాడు. అతని కీ అనుభవం జన్మలో మరువలేనిది.

గానమాధుర్యపు మత్తునుంచి విడివడడాని కిష్ట పడక అయిష్టంగా హాలు ఖాళీ చేస్తున్న జనాన్ని విస్తుపోతూ చూస్తున్నాడు. వాళ్ళు ముఖాలు వేలాడేసుకుని వెళ్తున్నారు.

ఒక వ్యక్తి మాత్రం ఇంకా నిశ్చల సమాధిలో అర్ధనిమీలిత నేత్రాలతో అలాగే ఉన్నాడు.

నా గానాని కింత శక్తి ఉందా? మరి నిగ్రహించుకోలేని బుచ్చిరాజా వ్యక్తిని గాఢాలింగన చేసుకున్నాడు.

అతను గింజుకుంటూ- 'నీ కిది న్యాయం కాదు. పంతీ! సంగీత సభ నీకు నిషేధ స్థలం-రావద్దు-కచేరీ అవలేదు.'

అతని మాటలు మత్తుగా వినిపించాయి. అర్థంకాక తెల్లబోయిన బుచ్చిరాజు భుజం తట్టాడు అప్పారావు ఓదార్పుగా.

'బుచ్చిరాజూ! మనసుకి నిగ్రహం తెచ్చుకో. నీకు ఆహ్వానం పంపిన సభ పేరు చూసి నేను మూర్ఛపోయాను. గుర్తుందా? నీ కా రోజు చెప్పనందుకు క్షమించు. బి.బి.ఎస్. అంటే భార్యా బాధితుల సంఘంవారు. వీరి భార్యలకు నిషేధం సంగీతం ఒక్కటే. అందుకే ఎంత ఖర్చయినా భరించి నిన్ను అంత దూరం నుంచి రప్పించారు. పదేళ్ళుగా ఇక్కడ కచేరీ జరగలేదు. ఈ ఊరి సంగతి తెలిసిన ఏ సంగీత విద్వాంసుడూ ఇటు రాడు. ఆ వ్యక్తిని కదపకు. ఇంటి కెళ్ళాల్సి వస్తోందని దుఃఖిస్తున్నాడు. పద పోదాం.'

ఏదో గుర్తు కొచ్చినట్లు గుప్పెట్లో నలిగిపోయిన చీటీ విప్పాడు బుచ్చిరాజు. వెంటనే కళ్ళు తిరిగి పడిపోయిన అతన్ని నలుగురి సాయంతో కారులో పడుకోపెట్టాడు అప్పారావు.

నిట్టూరుస్తూ చీటీ ఇలా చదివాడు అప్పారావు-

"అయ్యా! హంసనాదంగారూ! మాభర్తలను ఇంకా ఎంత సేపు అట్టే బెడతారు. మీ కర్ణ కఠోర సంగీతం వల్ల మేము సభను సమీపించలేకపోతున్నాం. ఇంతటితో కచేరీ ఆపండి. మరెప్పుడూ ఈ ఊరు రాకండి. రావడానికి సాహసించారో, ఏకీలు కా కీలు విరగ్గొట్టి పార్సెల్ కడతాం మీ ఊరికి!

ఇట్లు
బి.బి.ఎస్. అధ్యక్షుడి భార్య."

*


జీవితం చాలా అపురూపమైనది జీవించండి దర్జాగా



బ్రిల్ క్రీమ్ హెయిర్ డ్రెసింగ్
మీ జీవనశైలికి వన్నె తెస్తుంది.




ఉచితం!
"హౌ టు లుక్ స్మార్ట్ అండ్ ఫీల్ కాన్ఫిడెంట్"
అన్న మా చిన్న పుస్తకం కోసం వ్రాయండి.
జాడీ మూత లోపలి కార్క్‌తోపాటు 70 పైసల స్టాంపు జతపరిచి, ఈ క్రింది చిరునామాకు పంపండి.

హెచ్.ఎమ్.ఎమ్. లిమిటెడ్, డిపార్ట్‌మెంట్
APW. 1 శైపింగ్ రోడ్, న్యూ ఢిల్లీ-110001

OBM/5829Tel